క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి స్థానిక ఎంపీటీసీ పద్మ దంపతులు రూ.2 లక్షల 11 వేల 116ల విరాళాన్ని ప్రకటించారు. అందుకు సంబంధించిన చెక్కును, కొంత నగదును శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కమ్మర్‌పల్లి: హసకొత్తూర్ గ్రామానికి చెందిన భూమన్న అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. శస్త్ర చికిత్స అవసరం కాగా, వైద్య ఖర్చుల కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డిని సంప్రదించారు. దీంతో ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.3.75 లక్షల ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్)ని మంజూరు చేయించినట్లు భూమన్న కుటుంబ సభ్యులు తెలిపారు.

కుటుంబానికి అండగా ఉంటాం



బోధన్‌టౌన్/బోధన్/బోధన్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యుత్ శాఖ రూరల్ ఏఈ రవిచంద్ర కుటుంబానికి అండగా ఉంటామని ఆ శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవా రం బోధన్‌కు విచ్చేసిన సీఎండీ పట్టణంలోని మృతుడు రవిచంద్ర ఇంటికి వెళ్లి ఆయన భౌతి క కాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శాఖా పరంగా సహాయం అందిస్తామని, కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. మృతుడి కుమారుడిని ఓదార్చారు. అధైర్య పడ వద్దని కుటుంబ సభ్యులకు సూచించారు. సీ ఎండీ వెంట డీఈ ముక్తార్, జిల్లా అధికారులు, ఏఈలు, డీఈలు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాహిద ఫిర్దౌజ్ తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతిలో మైనార్టీ విద్యార్థినులు చేరేందుకు సీట్లు ఉన్నాయన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో అన్ని విభాగాల్లో చేరేందుకు అర్హులైన మైనార్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎన్‌టీఏ బోర్డును రద్దు చేయాలి

ఆర్మూర్‌టౌన్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) బోర్డును రద్దు చేసి 24 లక్షల నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సీవీఆర్ కళాశాల నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ ఎన్‌ఎస్‌యూఐ నేతలు నరేందర్, అఖిల్ మాట్లాడుతూ.. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. పేపర్ లీకేజీలకు పాల్పడ్డ వారిని చట్ట పరంగా శిక్షించాలని అన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



బోధన్: సాలూర మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసుకున్న వివేకానంద సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని రెండు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా రూ.30 వేల విలువ చేసే నోట్‌బుక్స్, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. సంఘం నేతృత్వంలో పదేళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఇల్లెపు శంకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు గంగారాం, హెచ్‌ఎంలు వరలక్ష్మి, సబితా కుమారి, పాఠశాల చైర్మన్ రాజమణి పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను శుక్రవారం ఎన్‌ఆర్‌ఐ రామలింగారెడ్డి పంపిణీ చేశారు. కల్లూర్ గ్రామానికి చెందిన రామలింగారెడ్డి 65 మంది విద్యార్థులకు ఒక ఏడాదికి అవసరమైన నోట్ బుక్స్ అందించారు. స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ అలివేలు, హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26న స్థూపం ఆవిష్కరణ

నవీపేట: ఈనెల 26న విప్లవ ఉద్యమ నాయకులు దుర్గంపూడి వెంకట కృష్ణ స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డులోని పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఐఎఫ్‌టీయు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నాయకులు నరేందర్, రాజేశ్వర్, గుమ్ముల గంగాధర్, పుట్ట నడ్పి నాగన్న పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



డొంకేశ్వర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



బాల్కొండ: యోగా ఆకారంలో కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. నిత్యం యోగా చేయడం వలన సంపూర్ణం ఆరోగ్యం లభిస్తుందని, మానసిక ప్రశాంతత, చురుకుదనం పెరుగుతుందని వక్తలు, నిర్వాహకులు, యోగాచార్యులు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరికీ యోగా ఎంతో అవసరమన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పెర్కిట్‌లో..



ఆర్మూర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు



బాల్కొండ ప్రభుత్వ కళాశాలలో..



పాత వర్నిలో..



వేల్పూర్ మినీస్టేడియంలో.. వాకర్స్ యూత్ సభ్యులు



యోగా మాస్టర్ హిమబిందును సన్మానిస్తున్న రక్ష స్వచ్ఛంద సంస్థ సభ్యులు



రుద్రూర్‌లో ..

ఆధ్యాత్మికం..

గ్రామ దేవతలకు జలాభిషేకం



మాక్లూర్: వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థిస్తూ శుక్రవారం మండల కేంద్రానికి చెందిన ప్రజలు గంగాజలం తెచ్చి గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్ట గొప్ప పుణ్యక్షేత్రం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టను శుక్రవారం సిద్ధిపేటకు చెందిన రాజయోగి సిద్ధేశ్వర మహారాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్ధులగుట్ట ఎంతో గొప్ప పుణ్య క్షేత్రమని, అత్యంత తపస్సు శక్తి గల ప్రాంతమన్నారు. తెలంగాణలో నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రాన్ని నిర్మించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పీఎస్‌ఎస్‌ఎం సభ్యులు సాయికృష్ణారెడ్డి, సిద్ధుల గుట్ట ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమిషాంబ దేవి ఆలయంలో అన్నదానం

బాల్కొండ: మండల కేంద్రంలోని నిమిషాంబ దేవి ఆలయంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజల నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలకు తులాభారం నిర్వహించారు.

మల్లన్న ఆలయంలో..

బాల్కొండ మండల కేంద్రంలో మల్లన్న ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఆలయంలో ప్రతి పౌర్ణమికి అన్నదానం నిర్వహిస్తారు.

గంగమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



రుద్రూర్: మండల కేంద్రంలో శుక్రవారం సత్యగంగ పౌర్ణమి(ఏరువాక పౌర్ణమి) వేడుకలు వైభవంగా నిర్వహించారు. చెరువు కట్టమీద ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగపుత్ర సంఘం వద్ద నుంచి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. మహిళలు చెరువులో సంప్రదాయంగా తెప్పలు వదిలి గంగమ్మ తల్లికి పూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

బీజేపీ నేత యెండల పూజలు

గంగమ్మ దేవి ఆలయంలో శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి యెండల లక్ష్మీ నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ తోట శంకర్, ఓబీసీ జిల్లా కార్యదర్శి సుధాకర్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు హరికష్ణ, తదితరులున్నారు.

తైబజార్ వేలం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు సమక్షంలో తైబజార్ వేలం పాట నిర్వహించారు. ఇందులో ప్రభుత్వం ధర రూ.22 లక్షల 86 వేలుగా నిర్ణయించారు. వనం సురేష్ అనే వ్యక్తి రూ.22 లక్షల 86 వేలకు తైబజర్ వేలాన్ని కైవసం చేసుకున్నాడు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, సిబ్బంది పాల్గొన్నారు.

జయశంకర్‌కు ఘన నివాళులు

తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని జిల్లాలో పలు చోట్ల శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన సేవలను వక్తలు గుర్తు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నివాళులర్పిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు

యోగా ఆరోగ్యానికి మంచిది

- ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌టౌన్(బోధన్): యోగాతో ఆరోగ్యాన్ని అన్ని రాకాలుగా కాపాడుకోవచ్చని, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని విజయసాయి పాఠశాలలో యోగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. భారత దేశంలో తొలిసారిగా ప్రపంచ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రతి రోజూ ప్రతి ఒక్కరు ఉదయం యోగాసనాలు వేయాలని సూచించారు. అతిథులుగా విచ్చేసిన వారిని ఘనంగా సన్మానించారు. ఎంఈవో నాగనాథ్, యోగా ఉపాధ్యాయులు బోతల్‌వార్ సాయిలు, పాఠశాల హెచ్‌ఎం కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ డిమాండ్

బోధన్: రాష్ట్రంలో మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ(ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్) రాష్ట్ర అధ్యక్షుడు జవారే రాహుల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కామన్ ఫీజు విధానం తీసుకురావాలని కోరారు. శుక్రవారం బోధన్ పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సంఘం జిల్లా, డివిజన్ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, సొంత భవనాలు నిర్మించి సౌకర్యాలు మెరుగు పర్చాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. నాయకులు నాగరాజ్, రాజన్న, గంగాసింగ్, శ్రీనివాస్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాహుల్ తదితరులు

సంక్షిప్తం

ఎమ్మెల్యే పోచారం దిష్టిబొమ్మ దహనం



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఉదయం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాడు రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరాడని, టీడీపీ అధికారం నుంచి దూరం కాగానే టీఆర్‌ఎస్‌లో చేరాడని , కేవలం అధికారమే పరమావధిగా పార్టీలు మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని నినాదాలు చేశారు.

పోచారం వెంటే మేమంతా



కోటగిరి(రుద్రూర్): బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంటనే ఉంటామని కోటగిరి ఉమ్మడి మండల బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ శివారులో కోటగిరి, పోతంగల్ మండల బీఆర్‌ఎస్ నాయకులు సమావేశమై రాజకీయ భవిష్యత్తు గురించి చర్చించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డితోనే ఉండాలని నిర్ణయించుకున్నారు. సమావేశంలో కోటగిరి ఉమ్మడి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్, జెడ్పీటీసీ శంకర్ పటేల్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన

నవీపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగేపూర్ గ్రామంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే పనులను నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. సర్వే పనులను తొందరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో రామకృష్ణ ఉన్నారు.

జీపీ కార్మికుల వినతి

బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్‌కు మండలంలోని వివిధ గ్రామాల జీపీ కార్మికులు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయనను నేరుగా కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్‌వాడీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి'

ఆర్మూర్: తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపి శిక్షణ సేవల ప్రాధాన్యతను గుర్తించి వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజ గంగారాం సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో ఫిజియోథెరపి శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. మండల విద్యాధికారి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఫిజియోథెరపీ వైద్యులు రేణుక మాట్లాడుతూ.. శిబిరంలో శిక్షణ పొందిన చిన్నారుల తల్లిదండ్రులు వైద్యులు సూచించిన పద్ధతులను ఇంటి వద్ద ప్రాక్టీస్ చేయాలని సూచించారు.

పూట గడిచేదెలా..!

- ఎస్సారెస్పీలో జూలై 1 నుంచి చేపల వేట నిషేధం
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న మత్స్యకారులు



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధిస్తారు. దీంతో ఈ సమయంలో తాము ఎలా బతకాలని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్‌పై ఆధారపడి నిర్మల్, నిజామబాద్ జిల్లాల్లో ఆరు వేల మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో సహజ సిద్ధంగా చేపలు ఉత్పత్తి చేసే కాలం కావడంతో అధికారులు చేపల వేటను నిషేధిస్తారు. మరో వారం రోజులు గడిస్తే ఎస్సారెస్పీలో చేపల వేట నిషేధం. రెక్కాడితే గాని డొక్కాడని మత్స్యకారులకు రెండు నెలలు చేపల వేట లేకుంటే పూట గడవడం కష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని వేడుకుంటున్నారు.

గతంలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపల వేట నిషేధిత కాలంలో మత్స్యకారులను ఆదుకోవడం కోసం పథకాన్ని అందించారు. అందులో భాగంగా బియ్యం, ఆర్థిక సహాయం అందించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ పథకం అటకెక్కిందని మత్స్యకారులు అంటున్నారు. ప్రస్తుతం రెండు నెలలు వేట లేకుంటే పూట గడవదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అయిన మత్స్యకారుల కోసం ఆలోచన చేయాలని వేడుకుంటున్నారు. కనీసం బియ్యం, నిత్యావసర సరుకులు అందించాలని వేడుకుంటున్నారు.

కష్టంగా ఉంటుంది



రెండు నెలలు చేపల వేట నిషేధిత కాలంలో పూట గడవాలంటే కష్టంగా ఉంటుంది. ఇతర పనులు చేపట్టడానికి కూడా లేవు. కుల వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తాం. ప్రభుత్వం ఆదుకోవాలి. – వినోద్, మత్స్యకారుడు

గతంలో ఇచ్చేవారు



జూలై, ఆగస్టులో చేపలు పిల్లలను అధికంగా ఉత్పత్తి చేసేకాలం కావడంతో ప్రతి ఏటా వేటను నిషేధిస్తారు. గతంలో మత్స్యకారులకు బియ్యం ఇచ్చేవారు. ప్రస్తుతం ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఆలోచన చేసి ఆదుకోవాలి. – భూమన్న, మత్స్యకారుడు

చేపలను వేటాడొద్దు

జూలై, ఆగస్టు నెలల్లో చేపలు పిల్లలను సహజ ఉత్పత్తి చేస్తాయి. ఈ రెండు నెలలు చేపల వేట నిషేధం. నిషేధ కాలంలో మత్స్యకారులను ఆదుకోవడానికి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– రాజనర్సయ్య, ఏడీ, నిజామాబాద్

అదనపు భూ పరిహారం ఇవ్వాలి

బోధన్: బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వరకు జాతీయ రహదారి–63కు అనుసంధానంగా బీటీ రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇందులో భాగంగా సాలూర మండల కేంద్రం శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బైపాస్ రోడ్డు నిర్మాణానికి గ్రామ రైతుల సాగు భూములను అధికారులు సేకరించారు. ఈ భూములకు పరిహారం తక్కువగా వచ్చిందని, పెంచి అదనంగా పరిహారం చెల్లించాలని కోరుతూ లోక్‌సభ ఎన్నికల ముందు రైతులు,కాంగ్రెస్ మండల నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అదనపు పరిహారం చెల్లింపు అంశం పెండింగ్‌లో పడింది. శుక్రవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి రెవెన్యూ శాఖ సమీక్ష సమావేశానికి విచ్చేసిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కాంగ్రెస్ నేత అల్లె రమేష్, అదనపు పరిహారం విషయాన్ని వివరించారు. త్వరగా తగు నిర్ణయం తీసుకొని రైతులకు ఆదుకోవాలని కోరారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నేతలు

బోధన్ ఆర్టీసీ డిపో తనిఖీ

బోధన్: ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్ కుమార్ శుక్రవారం బోధన్ ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపోకు సంబంధించిన ఖాళీ స్థలాలు, బస్టాండ్ ప్లాట్‌ఫాంలు, వెహికిల్ పార్కింగ్ పాయింట్‌ను పరిశీలించారు.

అనంతరం డిపో అధికారులతో సమావేశమయ్యారు. డిపో రోజువారీ ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జానీరెడ్డి, డిపో మేనేజర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

చెరువు అలుగు, తూము మరమ్మతుకు వినతి

బోధన్: ఊట్‌పల్లి శివారులోని ఊర చెరువు అలుగు, తూము మరమ్మతు చేయించాలని శుక్రవారం బోధన్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని గ్రామ కాంగ్రెస్ నాయకులు, రైతులు కలిసి విన్నవించారు. అలుగు, తూముల లీకేజీ వల్ల చెరువు నీరు వృథాగా పోతున్నాయని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మరమ్మతులు చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారని గ్రామ నేతలు తెలిపారు.



ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో ఊట్‌పల్లి రైతులు

సామూహిక అక్షరాభ్యాసం

బోధన్: పట్టణ కేంద్రంలోని తట్టికోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – హరోంహర (తెలుగు) – 12.00, 6.30; మనమే(తెలుగు)–3.15, 9.45

స్క్రీన్-2 – మహారాజ (తెలుగు) – 12.45, 3.50, 6.55, 10.00

స్క్రీన్-3 – ఓమైగాడ్(తెలుగు) – 1.20, 6.45; నింద(తెలుగు)– 4.05, 9.30

స్క్రీన్-4 – ఏ(తెలుగు) – 11.55, 3.10, ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు) – 6.25, మరణం(తెలుగు)– 9.15